




దాసరి

# ఉదయం

తెలుగు దినపత్రిక

FROM Karimnagar, Hyderabad, Warangal, Khammam, Mulugu

సంపుటి: 10 సంచిక: 327 కరీంనగర్ మంగళవారం 02-08- 2022 పేజీలు : 8 వెల : 1.00


# బ్రిటన్ ప్రధాని రేసులో.. జాతివివక్ష ప్రశ్నే లేదు



## పీఎంగా బెస్ట్ పర్సన్‌నే కన్జర్వేటివ్ పార్టీ ఎన్నుకుంటది

## పోటీలో వెనకబడ్డా.. ఫైట్ చేస్తా: బ్రిటీష్ ఇండియన్ నేత రిషి

లండన్: బ్రిటన్‌లో అధికారంలో ఉన్న కన్జర్వేటివ్ పార్టీలో జాతివివక్ష అన్న ప్రసక్తే లేదని పార్టీ లీడర్ షిప్, ప్రధాని పదవికి పోటీలో ఉన్న బ్రిటిష్ ఇండియన్ నేత, ఎంపీ రిషి శునక్ స్పష్టం చేశారు. కన్జర్వేటివ్ పార్టీ లీడర్ ఎన్నికకు జరిగే ఓటింగ్‌లో జాతివివక్ష అంశం ప్రభావం ఏమాత్రం ఉండబోదని ఆయన తేల్చిచె ప్పారు. బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ రాజీనామాతో అధికార కన్జర్వేటివ్ పార్టీ సెప్టెంబర్ 5న కొత్త నాయకుడిని ఎన్నుకోనుండగా.. ఆ పార్టీ ఎంపీ రిషి శునక్, విదేశాంగ మంత్రి లిజ్ ట్రస్ బరిలో ఉన్నారు. అయితే, జాతివివక్ష కారణంగా రిషి శునక్ పార్టీ లీడర్‌గా ఎన్నికయ్యే చాన్స్ లేదంటూ ఇటీవల ప్రచారం మొదలైంది. అలాగే ఇండియన్ ఆరిజిన్ బిజినెస్ మాన్, పార్టీ డోనర్ లార్డ్ రమీ రేంజర్ ఇటీవల మాట్లాడుతూ.. కన్జర్వేటివ్ పార్టీ లీడర్‌షిప్ ఎన్నికలో రిషి ఓడిపోతే బ్రిటన్‌ను జాతివివక్ష దేశంగా చూడాల్సి వస్తుందని కామెంట్ చేశారు. ఈ నేపథ్యంలో రిషి శునక్ తాజాగా 'ది డైలీ టెలిగ్రాఫ్' ఇంటర్వ్యూలో మాట్లాడారు. **ఆస్పత్రికి పేషెంట్లు దుమ్మా కొడ్తే ఫైన్ వేస్తా..:** "మా పార్టీ సభ్యులు మిగతా అన్ని విషయాల కంటే ప్రతిభకే పట్టం కడతారు. బ్రిటన్ ప్రధానిగా ఎవరు బెస్ట్ పర్సన్ అన్నదే ఆలోచిస్తారు. జెండర్, జాతి అనేవి ఇందులో ఎలాంటి ప్రభావం చూపించబోవని నమ్ముతున్నా" అని రిషి స్పష్టంచేశారు. రేసులో తాను వెనుకబడినట్లు సర్వేలు చెప్తున్నాయని, కానీ పార్టీ సభ్యుల ఓట్లను గెలుచుకునేందుకు ప్రయత్నం కొనసాగిస్తానన్నారు. ప్రధానిగా ఎన్నికైతే బ్రిటన్‌ను మరింత అద్భుతమైన దేశంగా మారుస్తానన్నారు. గవర్నమెంట్ డాక్టర్ల అపాయింట్ మెంట్ తీసుకుని, చెకప్?కు రాని పేషెంట్లకు 10 పౌండ్ల ఫైన్ విధించేలా రూల్స్ తెస్తానని ప్రకటించారు.

# హైదరాబాద్‌లో భారీ వాన..



హైదరాబాద్: హైదరాబాద్‌లో భారీ వర్షం కురుస్తున్నది. ఉదయం ఎండకొట్టినప్పటికీ.. క్రమంగా మబ్బులు కమ్ముకోవడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, కూకట్‌పల్లి, ఎర్రమంజిల్, ఖైరతాబాద్, బషీర్‌బాగ్, అమీర్‌పేట, తర్నాక, చింతల్ బస్తి, సోమాజిగూడ, నాంపల్లి, లక్డీకపూల్, కోఠిలో కుండపోతగా వర్షం కురుస్తున్నది. నారాయణగూడ, హిమాయత్‌నగర్, మాదాపూర్, లింగంపల్లి, ఉప్పల్, ఓయూ క్యాంపస్, నాచారం, మల్లాపూర్, కాప్రా, ఈసీఐఎల్, సికింద్రాబాద్, బేగంపేట, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భారీ వర్షం పడుతున్నది. చాదర్‌ఘాట్, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్‌లో వర్షం కురుస్తున్నది. అయితే ఒక్కసారిగా వరణుడు విరుచుకుపడటంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. పంజాగుట్ట శ్మశానవాటిక వద్ద భారీగా వాన నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఈ నెల 3,4 తేదీల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమ, మంగళ వారాల్లో కొన్నిప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు పడుతాయని వెల్లడించింది.

## నలుగురు లోక్‌సభ ఎంపీల సస్పెన్షన్ ఎత్తివేసిన స్పీకర్



న్యూఢిల్లీ: విపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల?లో వాయిదాల వర్వం కొనసాగుతోంది. ఈ క్రమంలో పలువురు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను సస్పెండ్ చేశారు. తాజాగా నలుగురు లోక్‌సభ ఎంపీలపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేశారు స్పీకర్ ఓం బిర్లా. మరోవైపు.. విపక్షాల ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీంతో సోమవారం సభ రెండు సార్లు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన తర్వాత ధరల పెరుగుదలపై చర్చ చేపట్టారు. సభలో విపక్షాల ఆందోళనల నేపథ్యంలో సోమవారం ఉదయం అన్ని పార్టీల ఎంపీలతో సమావేశమయ్యారు స్పీకర్ ఓం బిర్లా. సభలో చర్చలు జరగాల్సిన సమయంలో ఆటంకాలు కలిగించటం దేశానికి నష్టం కలుగుతోందన్నారు స్పీకర్. సభామర్యాదను అంతా కలిసి కాపాడాలని పిలుపునిచ్చారు. సభలోకి ప్లకార్డులు తీసుకురావొద్దన్నారు. ఈ క్రమంలోనే నలుగురు సభ్యులపై సస్పెన్షన్‌ను ఎత్తివేసేందుకు ప్రతిపాదనను సభ ముందుకు తీసుకొచ్చింది ప్రభుత్వం. దానిని ఆమోదించింది లోక్‌సభ. సస్పెన్షన్‌కు గురైన వారిలో కాంగ్రెస్ ఎంపీ మానికమ్ ఠాగూర్, జోతిమని, రమ్యా హరిదాస్, టీఎన్ ప్రతాపన్‌లు ఉన్నారు. ధరల పెరుగుదలపై ప్లకార్డులు పట్టుకుని నిరనసలు చేసిన క్రమంలో ఈ సమావేశాల నుంచి సస్పెండ్ చేశారు.

# మూడో సారి కూడా ముఖ్యమంత్రి కేసీఆరే

## శ్రీవారి సన్నిధిలో మంత్రి గంగుల



తిరుమల: తెలంగాణ రాష్ట్రంలో మూడవసారి టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అవుతారని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తిరుమల శ్రీవారిని తెలంగాణ బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ దర్శించుకున్నారు. సోమవారం ఉదయం స్వామి వారికి జరిగే నైవేద్య విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మంటపంలో వేదపండితులు మంత్రి దంపతులకు వేధ ఆశీర్వచనం అందించగా, టిటిడి ఆలయ అధికారులు స్వామి వారి పట్టు వస్త్రాలను,తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీటీడీ సహకారంతో కరీంనగర్ లో 10 ఎకరాల స్థలంలో శ్రీవారి ఆలయం నిర్మించబోతున్నట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని విమర్శలు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి కేసీఆర్ ను తమ ఆస్తిగా భవిస్తారని, కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో మూడో సారి కూడా ప్రజలు కేసీఆర్ కు పట్టం కట్టబోతున్నారని స్పష్టం చేశారు. మంత్రి గంగుల కమలాకర్ వెంట కరీంనగర్ టిఆర్ఎస్ కోఆర్డినేటర్ పొన్నం అనిల్ గౌడ్ ఉన్నారు.

# ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా సంజయ్ అరోరా బాధ్యతల స్వీకరణ..




న్యూఢిల్లీ: ఢిల్లీ పోలీసు కమిషనర్‌గా సంజయ్ అరోరా బాధ్యతలను స్వీకరించారు. అరోరాది తమిళనాడు క్యాడర్. 1998వ బ్యాచ్ ఐపీఎస్ ఆఫీసర్. జూలై 31, 2025లో ఆయన రిటైర్ కానున్నారు. అరోరాకు ముందు గతంలో ఆస్థానా(గుజరాత్ క్యాడర్), అజయ్ రాజ్ శర్మ(యూపీ క్యాడర్)లు బాధ్యతలు నిర్వర్తించారు. జైపూర్‌లోని మాల్వియా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ అండర్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డిగ్రీ చేశారు. 57 ఏళ్ల సంజయ్ అరోరా తమిళనాడు పోలీసుకు చెందిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ లో చేశారు. వీరప్పన్‌ను అంతం చేసిన టీమ్‌లో ఈయన ఉన్నారు. సీఎం గ్యాలెంటరీ అవార్డు కూడా అందున్నారు.సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ దళాలోనూ అరోరా కొన్నేళ్లు చేశారు. ఇంటర్ క్యాడర్ డిప్యూటేషన్‌కు అంగీకరించినట్లు కేంద్ర హోంశాఖ తన సర్క్యూలర్‌లో తెలిపింది.

# ఈడీ అదుపులో ఎంపీ సంజయ్ రౌత్



ముంబై, : శివసేన సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. పత్రాచల్ భూకుంభకోణంలో నగదు అక్రమ చలామణి కేసుకు సంబంధించి ముంబయిలోని ఆయన నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు లోతైన విచారణ కోసం రౌత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అంతకుముందు ప్రకటించారు. పత్రాచల్ పునరాభివృద్ధిలో భారీ అక్రమాలు జరిగాయంటూ సంజయ్ రౌత్ భార్య, అతని సన్నిహితులపై ఆరోపణలున్నాయి. ఇదే కేసులో సంజయ్ రౌత్ జులై 1న ఈడీ అధికారుల ఎదుట హాజరై వాంగ్మూలం ఇచ్చారు. ఆ తర్వాత రెండు సార్లు సమన్లు జారీ అయినా పార్లమెంటు సమావేశాలు ఉన్నాయంటూ గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 7 గంటలకు ఈడీ అధికారులు సంజయ్ రౌత్ నివాసానికి చేరుకున్నారు. 9 గంటలపాటు విచారించిన తర్వాత ఆయనను ముంబయిలోని ఈడీ కార్యాలయానికి తీసుకెళ్లారు. రూ. 1,034 కోట్ల పత్రాచాల్ భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణకు సంబంధించి ఈడీ అధికారులు ఆయనను ప్రశ్నించారు. అర్ధరాత్రి దాటాక రౌత్ అరెస్టు విషయాన్ని ప్రకటించారు. ఈడీ అధికారుల సోదాలపై శివసేన నేత సంజయ్ రౌత్ ట్విటర్ వేదికగా స్పందించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల సోదాలపై సంజయ్ రౌత్ ట్విటర్ వేదికగా స్పందించారు. రాజకీయ కుట్రలో భాగంగానే తనపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. తాను ఎలాంటి తప్పు చేయలదేన్నారు. "ఎట్టి పరిస్థితుల్లో శివసేనను వీడేది లేదు. చనిపోయినా సరే.. నేనెవరికీ తలొగ్గబోను. నాకు ఎలాంటి కుంభకోణంతో సంబంధం లేదు. బాలాసాహెబ్ ఠాక్రేపై ప్రమాణం చేసి ఈ విషయం చెబుతున్నాను. బాలాసాహెబ్ మాకు ఎలా పోరాడాలో నేర్పారు. శివసేన కోసం పోరాటం కొనసాగిస్తూనే ఉంటా" అని ట్వీట్ చేశారు. శివసేనను అంతమొందించే కుట్రలో భాగంగానే ఈడీ సోదాలు జరుగుతున్నాయని ఆ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. ఈడీ భయంతోనే శివసేన ఎమ్మెల్యేలు పలువురు తిరుగుబాటు నేత ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరారని విమర్శించారు. సంజయ్ రౌత్ నిరపరాధి అయితే ఈడీ అధికారుల చర్యలకు భయపడాల్సిన అవసరం లేదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే అన్నారు. ఏప్రిల్‌లో, ఈ దర్యాప్తులో భాగంగా రౌత్ భార్య వర్షా రౌత్, అతని ఇద్దరు సహచరులకు చెందిన రూ. 11.15 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ తాత్కాలికంగా అటాచ్ చేసింది. అటాచ్ చేసిన ఆస్తులు పాల్ఘర్, సఫాలే (పాల్ఘర్‌లోని పట్టణం), పద్గా (థానే జిల్లాలో) వద్ద సంజయ్ రౌత్ సహాయకుడు, గురు ఆశిష్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ డైరెక్టర్ అయిన ప్రవీణ్ ఎం రౌత్ ఆధీనంలో ఉన్న భూమి రూపంలో ఉన్నాయి. ముంబయి శివారులోని దాదర్‌లోని వర్షా రౌత్‌కు చెందిన ఫ్లాట్‌తోపాటు అలీబాగ్‌లోని కిహిమ్ బీచ్‌లో వర్షా రౌత్, సుజిత్ పాట్కర్ భార్య స్వప్నా పాట్కర్ సంయుక్తంగా కలిగి ఉన్న ఎనిమిది ప్లాట్లు కూడా అటాచ్ చేసిన ఆస్తుల్లో ఉన్నాయని ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది. రూ. 1,034 కోట్ల పత్రాచాల్ భూకుంభకోణం కేసుకు సంబంధించి ఇప్పటికే రౌత్ సన్నిహితుడు ప్రవీణ్ రౌత్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయన జుడిషియల్ కస్టడీలో ఉన్నారు.

# గన్ వాడేవాళ్లకు గన్‌తోనే సమాధానం ఇవ్వాలి..




కొచ్చి: తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతర్గత భద్రతకు సమకాలీన సవాళ్లు అనే అంశంపై కొచ్చిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాజీ ప్రధాని మన్మోహన్ తీరును ఆయన ఖండించారు. 2008లో ముంబై ఉగ్రదాడులు జరిగిన తర్వాత పాకిస్థాన్‌తో ఇండియా కుదుర్చుకున్న ఉగ్రవాద ఒప్పందాన్ని ఆయన తప్పుపట్టారు. ఆ ఉగ్రదాడితో దేశం విషాదంలో నిండిపోయిందని, కానీ 9 నెలలు గడవకముందే ఉగ్రవాద బాధితులమని రెండు దేశాల ప్రధానులు సంతకాలు చేసినట్లు గవర్నర్ రవి ఆరోపించారు. పాకిస్థాన్ మనకు మిత్ర దేశమా లేక శత్రు దేశమా, ఈ అంశంలో క్లారిటీ ఉండాలని, కన్ఫ్యూజన్ ఉండకూడదన్నారు. పుల్వామా దాడి తర్వాత పాక్‌లోని బాలాకోట్‌పై జరిగిన సర్జికల్ దాడిని గవర్నర్ రవి మెచ్చుకున్నారు. ఎవరైనా ఉగ్రవాద చర్యకు పాల్పడితే వాళు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని గవర్నర్ రవి తెలిపారు. మన్మోహన్ పాలనతో పోలిస్తే ఇప్పుడు అంతర్గత భద్రత మెరుగ్గా ఉందని అన్నారు. మన్మోహన్ పాలన సమయంలో మావో తీవ్రవాదుల హింస 185 జిల్లాల్లో ఉండేదని, ఇప్పుడు ఆ సంఖ్య 8 జిల్లాలకు తగ్గినట్లు ఆయన వెల్లడించారు. కశ్మీర్ అంశంపై మాట్లాడుతూ ప్రజలు సహకరించడం వల్లే ఉగ్రవాద నిర్మూలన సాధ్యం అవుతోందని గవర్నర్ రవి తెలిపారు. హింస పట్ల జీరో టాలరెన్స్ ఉందని, ఎవరైనా గన్ వాడితే వాళ్లకు ఆ గన్‌తోనే సమాధానం ఇవ్వాలని, దేశ ఐక్యత, సమగ్రతకు వ్యతిరేకంగా మాట్లాడేవారితో చర్చలు ఉండవని గవర్నర్ రవి తెలిపారు. గడిచిన 8 ఏళ్లలో ఎటువంటి సాయుధ గ్రూపుతో చర్చలు నిర్వహించలేదని ఆయన వెల్లడించారు. మావో ప్రాంతాల్లోని వాళ్లకు ప్రత్యేక ఐడియాలజీ ఉంటుందని, వాళ్లు పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాన్ని నమ్మరని, అయితే తాము దాన్ని అంగీకరించబోమని, ఇక వాళ్లతో చర్చలు అవసరం లేదని గవర్నర్ రవి తెలిపారు.

# కేసీఆర్ దారిలో జగన్ !



హైదరాబాద్ : ఇప్పటిదాకా భూముల రీ సర్వే తో అంతా మంచే జరుగుతుందని ఓ వాదన వినిపించింది. కానీ భూముల రీ సర్వే తో తరువాత జ రగబోయే పరిణామాలే ఆందోళన కలిగిస్తున్నాయని రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇది సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఆవేదన. కొన్ని చోట్ల సర్వేల పేరిట రెవెన్యూ శాఖ అధికారులు రైతులకు చుక్కలు చూపిస్తున్నారట. వివరాల నమోదులో తాత్సారం చేస్తూ వస్తున్నారట. మరికొన్ని చోట్ల రెవెన్యూ అధికారుల ఆడిందే ఆట పాడిందే పాట.. అన్న విధంగా ఉందని జనసేన నేతలు సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు. అంతేకాకుండా రీ సర్వే తరువాత ప్రభుత్వ భూమి లెక్క ఒకటి తేలిపోవడం ఖాయం. అటుపై సర్కారు వాటిని తమకు ఇష్టం వచ్చిన వారికి కేటాయించడమో లేదా తనఖా పెట్టి రుణాలు తేవడమో లేదా అమ్మేయడమో చేస్తారని తెలుగుదేశం ప్రజలను హెచ్చరిస్తోంది. అంటే తెలంగాణలో మాదిరిగానే ఏపీలో కూడా సర్కారే దగ్గరుండి ప్రభుత్వ భూములను అమ్మకాలు చేసేందుకు సిద్ధం అవుతుందన్న మాట ! వాస్తవానికి సరిగా ఆదాయం లేని ఏపీకి అటు మద్యంతో అయినా ఇటు భూముల అమ్మకంతో అయినా ఖజానాకు కాసులు చేరాలి. అందుకే ఇప్పటి కొత్త బార్ల లైసెన్సుల పేరిట డబ్బులు వెనకేసుకునేందుకు సిద్ధం అయింది. కేవలం దరఖాస్తుల రూపేణ 100 కోట్లకు పైగానే ఆర్జించింది. ఇదే సమయాన భూముల అమ్మకానికీ సిద్ధం అవుతోంది. అంటే రీ సర్వే తరువాత విలువైన భూముల లెక్క తేలాక అటుపై రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒకటి ప్రభుత్వం తరఫునే మొదలు కానుందా అన్న అనుమనాలను ప్రతిపక్షం వ్యక్తంచేస్తోంది. ఈ దశలో రీ సర్వేను వేగవంతం చే యాలని కలెక్టర్ల పై ఏపీ సర్కారు పెద్దలు ఒత్తిళ్లు తెస్తున్నారు. రీ సర్వే తరువాత విలువైన భూములు పెద్దల ఖాతాలోకి చేరిపోవడం ఖాయం అని జనసేన నేతలు విమర్శలు చేస్తున్నారు. వివరాలు రాయడంలో పారదర్శకత అన్నది లేనేలేదని సర్వేయర్లే అంతా తామై కథ ఒకటి నడిపిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

# మొక్కలను కాపాడుకుందామిలా..

## వర్షాలతో పెరుగుదలపై ప్రభావం సకాలంలో జాగ్రత్తలు పాటిస్తే మేలు



ముకరంపుర, : పచ్చదనంతో అలరారే మొక్కలు ఇంటికి సరికొత్త శోభను తీసుకువస్తాయి. పట్టణికీకరణ ప్రభావంతో పల్లెలు సైతం కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పరిమళాలను వెదజల్లే పూలు, ఆరోగ్యాన్నిచ్చే పండ్ల మొక్కలతో పాటు ఆకట్టుకునే ఆకృతుల్లో అల్లుకుపోతూ ఇంటి అందాన్ని మరింత ద్విగునీకృతం చేసే తీగలు, విభిన్న రంగులతో మనసు దోచే క్రోటన్స్, బోన్సాయ్‌లు, పలు రకాల చిట్టి మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వీటి కొనుగోలుకు వేలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. అయితే, గత కొన్ని రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు ఇండ్లలో అపురూపంగా పెంచుకుంటున్న మొక్కలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. అయితే, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మొక్కలు వడలిపోవడం.. తెగుళ వ్యాప్తి.. రోగాలు విజృంభిస్తుండడంతో పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. కాపాడుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు.

**మొక్కలు దెబ్బతినేదిలా..:** భారీ వర్షాలతో భూమిలో అధికంగా నీళు నిలిచి మొక్కలు సూక్ష్మ, ఇతర పోషకాలు గ్రహించలేవు. దీంతో ఆకులు ఎర్రబారి రాలిపోతాయి. ఎక్కువ రోజులు నీరు నిలిచి ఉండడం వల్ల వేర్లకు ఆక్సిజన్ ప్రసరణ జరగక వడలిపోతాయి. అధిక తేమ కారణంగా తెగుళ్ల వ్యాప్తి తీవ్రమవుతుంది. ఆకుల మీద మచ్చలు ఏర్పడి రాలిపోతాయి

**ఎప్పటికప్పుడు నీటిని తొలగించాలి:** ఏకధాటిగా వర్షాలు కురిసినా సకాలంలో చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఏ ఇబ్బందీ లేకుండా మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతాయి. కుండీల్లో నిలిచి ఉన్న నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలి. భూమిలో నాటిన మొక్కల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూడాలి. కాల్వ ద్వారా తొలగించాలి. మొక్కలు త్వరగా కోలుకోవడానికి 10 గ్రాముల 13:0:45, యూరియా 5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి మొక్కలపై పిచికారి చేయాలి. తెగుళ్ల నివారణ, ఆకులపై మచ్చలు ఏర్పడి రాలిపోకుండా నివారించడానికి బావిస్టిన్ 1 గ్రాము ఒక లీటర్ నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేస్తే త్వరగా కోలుకుని పెరుగుదల వేగంగా ఉంటుంది.

# పోలీసుశాఖలో ఖాళీల భర్తీకి కసరత్తు..

అమరావతి, : పోలీసుశాఖలో పోస్టుల భర్తీకి కసరత్తు జరుగుతోంది. సీఎం సూత్ర ప్రాయ అంగీకారంతో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. గత కొద్దిరోజులుగా ఇదే విషయంపై పోలీసు వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఉన్నతాధికారులు ఇందుకోసం పూర్తి స్థాయిలో దృష్టి సారించినట్లు వినికిడి. పోలీసుశాఖలో ఖాళీల భర్తీకి సంబంధించి గత రెండేళ్ళుగా ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత నిరీక్షిస్తోంది. అలాగే ఈ ఏడాది ఆరంభంలో పోలీసు ఉద్యోగాల భర్తీ ఉంటుందని ఎంతోమంది అభ్యర్థులు ఎదురుచూశారు. మరోవైపు పొరుగు రాష్ట్రం తెలంగాణాలో భారీ ఎత్తున పోలీసు ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం అదే మాటతో నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో పోలీసు ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి తెలంగాణాలో దాదాపు నియామక ప్ర క్రియ చివరి దశకు చేరుకున్నట్లుంది. కాగా తెలంగాణాలో కేసిఆర్ ప్రభుత్వం పోలీసు శాఖలో నియామకాల ప్రకటన చేయగానే ఏపీలో కూడా ఇక్కడి నిరుద్యోగులకు జగన్ సర్కార్ తీపి కబురు చెబుతుందనే ఆశతో గత కొన్ని నెలలుగా నిరీక్షిస్తున్నారు. ఈక్రమంలో తాజాగా 26వేల పోలీస్ ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ వెలువడిందనే సమాచారంతో నిరుద్యోగుల ఆశలు చిగురించినట్లైంది. పైగా ఈ ఏడాదే ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఈమేరకు హోంమంత్రి తానేటి వనిత తాజా ప్రకటన మరింత ఆశలు రేకెత్తిస్తున్నాయి. అయితే ఇందుకోసం ఏపి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది.



**త్వరలో నోటిఫికేషన్..:** ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా పోలీస్ శాఖలో భారీగా ఉద్యోగాలకు త్వరలోనే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనుంది. పోలీస్ శాఖపై ముఖ్యమం త్రి వైఎస్ జగన్ నిర్వహించిన గత సమీక్ష సమావేశంలో పోలీస్ శాఖలో ఖాళీలు, రాష్ట్ర అవసరాలు, కొత్త జిల్లాల తర్వాత అవసరమైన అదనపు పోస్టుల భర్తీపై చర్చించారు. ఈ మేరకు పూర్తి నివేదిక ఇవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీస్ శాఖ ఖాళీలకు సంబంధించి ఇప్పటికే భర్తీ చేయాల్సిన పోస్టులు, రాష్ట్ర అసరాల దృష్ట్యా అదనపు పోస్టులు మొత్తం కలిపి ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేయాలన్న దానిపై సమాచారం సేకరించారు. రాష్ట్రంలో మొత్తం 26,431 పోస్టులను భర్తీ చేయాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు దశలవారీగా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. తొలిదశలో 6,500 ఉద్యోగాలకు ఈ ఏడాదే నోటిఫికేషన్ జారీ చేసే అవకాశాలున్నాయి. మిగిలిన పోస్టులను దశలవారీగా భర్తీ చేయనున్నారు. ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే సీఎం జగన్ సూత్రప్రాయంగా అంగీకరించడంతో త్వరలోనే దీనికి సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసే అవకాశముంది. పైగా సత్యసాయి జిల్లాలో పర్యటనలో ఉన్న హోం మంత్రి పోలీసుశాఖలో ఉద్యోగాల భర్తీ విషయమై మీడియా వద్ద ప్రస్తావనకు రాగా త్వరలోనే ఈ ఏడాదిలోనే నోటిఫికేషన్ రానున్నట్లు ప్రకటించారు. దీంతో నిరుద్యోగులకు మరింత తీపి కబురు అందించినట్లైంది. అయితే ఏ విభాగంలో ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారనేది వెల్లడి కాలేదు. అదేవిధంగా సత్యసాయి జిల్లాలో నూతనంగా ప్రారంభించిన ఫోరెన్సిక్ సెంటర్‌తోపాటు, అమరావతిలోని మంగళగిరి డీజీపీ కార్యాలయం సమీపంలో ఉన్న టెక్‌టవర్‌లోని ఏపీ ఫోరెన్సిక్ విభాగంలో కూడా ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఇందులో పరిమిత సంఖ్యలో పోస్టులు ఉన్నందున అవుట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసే ఆలోచనలో పోలీసుశాఖ ఉన్నట్లు సమాచారం.

## ఈ ఏడాదే నోటిఫికేషన్ జారీకి అవకాశం

# సుక్మా జిల్లాలో ఎన్‌కౌంటర్..

## మాడ్ డివిజన్ కమిటీ కమాండ్ మృతి

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా బెజ్జీ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఓ మావోయిస్టుతు చనిపోయాడు. సోమవారం ఉదయం భందర్‌పదర్ గ్రామసమీపంలోని బెజ్జీ అటవీ ప్రాంతంలో జిల్లా రిజర్వ్ గార్డులు మావోయిస్టుల కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం 7.30 గంటల సమయంలో గాలింపు బృందాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరుపక్షాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయని, పోలీసుల కాల్పుల్లో ఓ మావోయిస్టు చనిపోయాడని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. మృతుడిని మాడ్ డివిజన్ కమిటీ కమాండర్ హడ్మా అలియాస్ సంకుగా గుర్తించామని చెప్పారు. ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు కొనసాగుతున్నది వెల్లడించారు. కాగా, గత పదిరోజుల వ్యవధిలో సుక్మా జిల్లాలో కాల్పులు చోటుచేసుకోవాడం ఇది మూడోసారి. మూడు ఎన్‌కౌంటర్లలో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. జులై 29న బింద్రపాణి గ్రామంలో, పల్బగాడి ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు.

# 'పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి, జహీరాబాద్ ఆస్పత్రులు




సంగారెడ్డి, : ఆధార్ కార్డు కోసం ఇప్పటి వరకు మీ సేవ లేదా ఆధార్ నమోదు కేంద్రాలలో మాత్రమే దరఖాస్తు చేసుకుంటూ వచ్చారు. కానీ ఇప్పుడు పుట్టిన శిశువుకు వెంటనే ఆస్పత్రుల్లో ఆధార్ కార్డు కోసం ఎన్రోల్?మెంట్? చేసుకునే ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో సంగారెడ్డి గవర్నమెంట్ హాస్పిటల్ లో శిశువుల ఆధార్? ఎన్రోల్?మెంట్ ప్రారంభమైంది. దీని ఆధారంగా టెంపరరీ ఐడీ కూడా కేటాయిస్తున్నారు. 45 రోజుల తర్వాత మీసేవ కేంద్రాలకు వెళ్లి బిడ్డ పేరు నమోదు చేసి ఆధార్ కార్డు డౌన్ లోడ్ చేసుకోవచ్చు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి, జహీరాబాద్ ఆస్పత్రులను ఎంపిక చేయగా, సంగారెడ్డిలో ఇప్పటివరకు 128 మంది పిల్లలకు సంబంధించి ఆధార్ ఎన్రోల్ మెంట్ అయ్యింది. జహీరాబాద్ లో ఇంకా స్టార్ట్ చేయలేదు. ప్రసవాలు ఎక్కువగా జరిగే గవర్నమెంట్ ఆస్పత్రులను ఎంపిక చేసి ఆధార్ ఎన్రోల్‌మెంట్ చేపడుతున్నారు.

**ఎన్రోల్ మెంట్ ఇలా..:** గవర్నమెంట్ హాస్పిటల్ లో ప్రసవమైన తర్వాత డిశ్చార్జి టైంలో ఎన్రోల్ మెంట్ ప్రక్రియ చేపడతారు. చైల్డ్ ఎన్రోల్‌మెంట్ క్లైంట్ యాప్ లో తల్లి, బిడ్డ వివరాలు నమోదు చేస్తారు. ముందు తల్లి పేరు, ఆధార్ నంబరు, వేలిముద్రలు, కాన్పు వివరాలు, డిశ్చార్జి సర్టిఫికెట్, శిశువు ఫొటో, ఫోన్ నంబర్ ఇతరత్రా వివరాలు యాప్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. తర్వాత నిర్దిష్ట ఫోన్ నంబర్ కు మెసేజ్ రూపంలో టెంపరరీ ఐడీ వస్తుంది. దాంతో అప్పుడే పుట్టిన బిడ్డ ఆధార్ ఎన్రోల్‌మెంట్ ప్రక్రియ పూర్తవుతుంది.


# నందిగామలో హరిత వర్షిణి ఆత్మహత్య కేసులో ఏడుగురు అరెస్టు





అమరావతి : ఎన్టీఆర్ జిల్లా నందిగామలో రికవరీ ఏజెంట్ల వేధింపులకు బలైన విద్యార్థిని హరిత వర్షిణి ఆత్మహత్య కేసులో పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు మేనేజర్లు, నలుగురు రికవరీ ఏజెంట్లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. హర్షిణీ తండ్రి రెండు క్రెడిట్ కార్డుల ద్వారా ఆరులక్షల రూపాయలను వాడుకున్నాడని పోలీసులు వివరించారు. వాటిని వసూలు చేయడానికి నిర్వాహకులు ఇంటికి వెళ్లారు. ఆసమయంలో తండ్రి ఇంట్లో లేకపోవడంతో కుటుంబ సభ్యులపై రికవరీ ఏజెంట్లు చట్ట విరుద్ధంగా ప్రవర్తించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన కూతురు హరిత వర్షిణి సుసైడ్ నోట్‌రాసి ఆత్మహత్యకు పాల్పడిం దని వివరించారు. విజయవాడలోని మొగల్‌రాజ్‌పురంలో కాల్‌సెంటర్ ఏర్పాటు ఏర్పాటు చేసుకుని వినియోగదారుల నుంచి రికవరీ చేస్తున్నారని తెలిపారు. హరిత వర్షిణి తల్లి ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసుకుని ఏడుగురు నిందితులను అరెస్టు చేశామని వెల్లడించారు. రికవరీ ఏజెంట్లు ఆర్‌బీఐ గైడ్‌లైన్ ప్రకారమే నడుచుకోవాలని, అవమానపరిచే విధంగాని దాడులకు గాని పాల్పడవద్దని తెలిపారు.

# మరోసారి రికార్డు సృష్టించిన జీఎస్టీ వసూళ్లు




జీఎస్టీ వసూళ్లు మరోసారి రికార్డు సృష్టించాయి. జులై 2022 నెలలో అత్యధికంగా లక్షా 48వేల 995 కోట్ల రూపాయల జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. ఇది జీవితకాల రెండో గరిష్ఠమని కూడా వెల్లడించింది. గతేడాది జులైలో వసూలైన జీఎస్టీ ట్యాక్స్? కన్నా ఈ సారి 28% శాతం అధికంగా రాబడి వచ్చిందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సీజీఎస్టీ 25వేల 751 కోట్లు, ఎస్ జీఎస్టీ 32వేల 807 కోట్లు, ఐజీఎస్టీ 79వేల 518 కోట్లు, సెస్ రూపంలో 10వేల 920 కోట్లు వసూలయ్యాయని తెలిపింది. గతేడాది జులై నెలతో పోల్చితే ఈ ఏడాది జీఎస్టీ వసూళ్లలో 28శాతం వృద్ధి నమోదైందని ఈ సందర్భంగా కేంద్రం ప్రకటించింది. జులై నెలలో తెలంగాణ నుంచి 4వేల 547 కోట్ల జీఎస్టీ వసూలు కాగా... గతేడాది ఏప్రిల్ నెలతో పోల్చితే ఇదే అధికమని తెలిపింది. జులై 2021లో వస్తు, సేవల పన్ను వసూళ్ల రూ. 1,16,393 కోట్లుగా ఉన్నాయి. అయితే జులై 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టిన నుంచి చూసుకుంటే ఈ ఏడాది జులైలో నమోదైన వసూళ్లు రెండో అత్యధికమైన వసూళ్లుగా మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

# సర్కారు దవాఖానాల్లో సౌలత్ సూపర్




వనపర్తి, : ఒకప్పుడు సర్కారు దవాఖాన అంటే చిన్న చూపు. సౌకర్యాలు లేక పేదలు సైతం వైద్యం చేయించుకునేందుకు జంకేవారు. సర్కారు దవాఖానల మీద సినిమాల్లో కూడా పాటలు వచ్చాయి. నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖానకు అనే పాట నాటి పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పట్టింది. తెలంగాణ ఏర్పడ్డాక, ఉద్యమనేత కేసీఆర్ సీఎం పదవి చేపట్టాక ప్రభుత్వ దవాఖానల్లో సౌకర్యాలకు కొదువలేదు. 24/7 సేవలు అందుబాటులోకి వచ్చాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సౌకర్యాలు కొలువుదీరాయి. కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు అందుతున్నాయి. దీనికి ఉదాహరణే వనపర్తి జిల్లాలో సర్కారు దవాఖానల్లో పెరుగుతున్న ప్రసవాల సంఖ్యకు నిదర్శనం. ఒకప్పుడు ప్రైవేట్ దవాఖానకు మాత్రమే ప్రసవాల కోసం వెళ్లే ప్రజలు ప్రస్తుతం ప్రభుత్వ దవాఖానకు క్యూ కడుతున్నారు. దీనికి సీఎం కేసీఆర్ పేరుతో ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్‌తోపాటు సౌకర్యాలు, సేవలు దోహదం చేస్తున్నాయి. కేసీఆర్ కిట్ ప్రవేశ పెట్టిన తర్వాత 2017నుంచి ఇప్పటివరకు వనపర్తి జిల్లాలో సాధారణ, సిజేరియన్ కాన్పులు 41,313 జరుగగా ఇందులో ప్రభుత్వ దవాఖానల్లో 23,934, ప్రైవేట్ దవాఖానల్లో కేవలం 17,379 డెలివరీలు జరిగాయి. సగటున ఒక్కోరోజు ప్రభుత్వ దవాఖానల్లో 70నుంచి 90 కాన్పులు జరుగుతున్నాయి అంటే ప్రభుత్వ వైద్యసేవలు ఎంత మేర మెరుగయ్యాయో అంచనా వేయొచ్చు.

**సర్కారు దవాఖానల్లో సాధారణ కాన్పులు:** ఒకప్పుడు కాన్పు అంటే భయపడే పరిస్థితి ఉండేది. గర్భిణులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రసవానికి దవాఖానలకు వెళ్లేవారు. తెలంగాణ రాక ముందు ప్రభుత్వ దవాఖానకు గర్భిణి ప్రసూతి కోసం వెళ్తే తల్లీబిడ్డ క్షేమంగా తిరిగివస్తారనే నమ్మకం లేదు. తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానకు వెళ్తే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి. భరించలేని ఆర్థికభారం ఉండేది. అంతేకాకుండా కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందని, ఆలస్యం చేస్తే తల్లీబిడ్డ ప్రాణాలకు ముప్పు అని అవసరం లేకున్నా సిజేరియన్లు చేసి డబ్బులు గుంజిన సందర్భాలున్నాయి. ప్రైవేట్ దవాఖానలకు వెళ్తే సాధారణ కాన్పు అన్న మాట ఉండేది కాదు. ఇప్పుడు ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ కాన్పులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అత్యవసరం అనుకుంటేనే సిజేరియన్లు చేస్తున్నారు. ప్రతి నెలా ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ కాన్పులు సగటున నెలలో 3500వరకు చేస్తున్నారు. ప్రైవేట్ దవాఖానల్లో నెలలో వెయ్యి కూడా సాధారణ కాన్పులు జరగడం లేదు. మొత్తం సాధారణ, సిజేరియన్ కాన్పులను పరిశీలించినా ప్రభుత్వ దవాఖానలతో పోల్చితే చాలా తక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ, సిజేరియన్ కలిపితే 23,934ఉండగా, ప్రైవేట్ దవాఖానల్లో కేవలం 17,379 డెలివరీలు జరిగాయి. దీంతో ప్రైవేట్ నర్సింగ్‌హోంల పరిస్థితి దారుణంగా తయారైంది. కొన్ని నర్సింగ్‌హోంలు మూసివేసే స్థితిలో ఉన్నాయి.

**కేసీఆర్ కిట్‌తో సంతోషం:** కేసీఆర్ కిట్ పథకంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన పథకం చాలామందికి ఆర్థిక భారాన్ని తగ్గించడంతోపాటు బిడ్డ పుట్టిన తర్వాత కావాల్సిన పోషకాహారం, తల్లీ బిడ్డకు కావాల్సిన ఇతర సౌకర్యాలు అందిస్తుండటం తో సంబురపడుతున్నారు. ఈ పథకం ప్రయోజనకరంగా ఉండటంతో ఆకర్శితులవుతున్నారు. ఈ పథకంలో గర్భిణికి రూ.12వేల ఆర్థిక చేయూత, ఆడబిడ్డ పుడితే మరో రూ.వెయ్యి అందజేస్తున్నారు. అంతేకాకుండా కిట్‌లో బేబీ ఆయిల్, బేబీ సోప్, దోమతెర, డ్రస్సులు, హ్యాండ్‌బ్యాగులు, పుట్టిన బిడ్డ ఆడుకునేందుకు బొమ్మలు, డైపర్స్, పౌడర్, షాంపూ, చీరలు, టవల్స్, న్యాప్‌కిన్స్ బేబీ బెడ్ అందిస్తున్నారు. ప్రైవేట్ దవాఖానకు వెళ్తే అడిగినంత ఫీజులు చెల్లించడంతోపాటు సిజేరియన్ పేరిట కోత బాధ భరిస్తూ డెలివరీ తర్వాత బాలింతకు, పుట్టినబిడ్డకు అవసరమైన వస్తువులు కొనడానికి చాలా ఖర్చు అయ్యేది. ఇప్పుడు ఆ బాధ తప్పింది. ఎలాంటి ఖర్చు లేకుండా సాధారణ ప్రసవం అయ్యే అవకాశం ఉంది. తప్పని పరిస్థితుల్లో సిజేరియన్ చేసినా నయా పైసా చెల్లించాల్సిన అవసరం లేదు. అదనంగా ఆర్థిక చేయూతతోపాటు 16రకాల వస్తువులు కేసీఆర్ కిట్ ద్వారా అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల కోసం వస్తున్నారు.



## అడవిపై కార్పొరేట్ కన్ను..

# అంతా కేంద్రం కనుసన్నల్లోనే

2022'ను నోటిఫై చేస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఆదేశాలు జారీచేసింది. రియల్ మాఫియా చేపట్టే భారీ ఎత్తున బహుళ అంతస్తుల నిర్మాణాలు, జల్, జంగిల్, జమీన్ ఔర్ ఇజ్జత్ కోసం పోరాడే ఆదివాసీ ప్రజలను ఆపరేషన్ గ్రీన్హంట్ పేరిట అంతం చేస్తూనే ఆ తెగ బిడ్డనే రాష్ట్రపతి చేయడం కళ! కళ దానికదే ఉదాత్తమైన దేమి కాదు. బీజేపీ పాలనలో దళితులు, ఆదివాసీలు తీవ్రమైన దాడులకు గురవుతున్నారు. వారి హక్కులు హరించివేయబడుతున్నాయి. 5వ షెడ్యూల్లో ని భూమిని వినియోగించుకునేందుకు గిరిజనుల అంగీ కారం కావాలన్న క్లాజును తొలగించారు. గనులపై ఉన్న గిరిజన హక్కులను కాలరాసారు. కీలకమైన సేవలను ప్రైవేటీకరిస్తున్నారు. ప్రభుత్వ శాఖల పనులను బైటవారితో చేయిస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ హక్కు ను ఇలాంటి కుయుక్తులతో మాయం చేస్తున్నారు. ప్రైవేటీకరణ అంటేనే రిజర్వేషన్ల రద్దు. దీన్నిమోడీ ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తోంది. షెడ్యూల్డు కులాల, తెగల సబ్ ప్లాన్ నిధులు భారీకోతలకు గురవుతున్నాయి. నూతన గనుల చట్టం ఆదివాసుల హక్కులను తీవ్రంగా దెబ్బతీస్తోంది. అడవుల్ని నమ్ముకొని బతుకుతున్న కోట్లాది మంది ఆదివాసీలు బతుకు ఆగం చేసే నిర్ణయం మోడీ సర్కార్ తీసుకుంది. ఆదివాసీలు, గిరిజనుల అనుమతి అవసరం లేకుండా అటవీ భూముల్ని వివిధ ప్రాజెక్టులకు వినియోగించే ప్రక్రియకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. 'అటవీ పరిరక్షణ నిబంధనావళి, ప్రాజెక్టులు, చెట్ల నరికివేత, ఇతర అభివృద్ధి పనులకు నిబంధనల్ని సడలించింది. అడవుల్లో నివసించే ఆదివాసీలు, గిరిజనులు, ఇతరుల అనుమతి అవసరం లేకుండా? భూముల కేటాయింపు జరగనున్నది. వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల నిమిత్తం ఆ భూముల్ని రియల్ మాఫియా షెడ్యూల్ ఏరియాలో ఇకపై ఇష్టానుసారంగా వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. ఆదివాసీ లకు నష్టపరిహారం చెల్లించే విధానం రియల్ మాఫియా కు అనుకూలంగా కేంద్రం మార్చింది. ఉదాహరణకు 5 నుంచి 40 హెక్టార్ల అటవీ భూములపై స్క్రీనింగ్ కమిటీ 60 రోజుల్లో కచ్చితంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్రం నోటిఫై చేసిన కొత్త నిబంధనావళిపై పర్యావరణ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నారు. అటవీ హక్కుల చట్టానికి తూట్లు పొడుస్తూ కొత్త నిబంధనావళిని కేంద్రం తీసుకొచ్చిందని ఆదివాసీ లు, ఆదివాసీ మేధావులు ఆరోపిస్తున్నారు. అటవీ హక్కుల చట్టం2006లో పేర్కొన్న నిబంధనా వళి స్థానంలో కొత్త నిబంధనావళిని కేంద్రం తీసుకొచ్చిం దని, ఇది అత్యంత ప్రమాదకరమైన విధానమని ఆదివాసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గనుల తవ్వకం, విద్యుత్ ప్రాజెక్టులు.. మొదలైనవాటి కోసం అడువుల నరికివేతకు మోడీ సర్కార్ సిద్ధమవుతోంది. బడా కార్పొరే ట్లకు కేటాయించిన ఆ ప్రాజెక్టుల కోసం చట్టాల్లో మార్పు లు చేస్తోంది. కొత్త నిబంధనావళిని తీసుకొచ్చింది. దీని ప్రకారం, ఏదైనా ప్రయివేటు ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి ఇవ్వగానే, ఇకపై ప్రయివేటు డెవలపర్స్ అడవుల్ని నరికి వేసి..భూముల్ని తమ ఆధీనంలోకి తీసుకోవచ్చు. ఆదివాసీలు, గిరిజనుల అంగీకారంతో సంబంధం లేకుండా, కేవలం రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది. ఇదంతా కూడా అత్యంత ప్రమాద కరమైనదిగా పర్యావరణ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు, ప్రజా సంఘాల నేతలు చెబుతున్నారు. అటవీ హక్కు ల చట్టాన్ని ఉల్లంఘిస్తూ కేంద్రం నిబంధనావళిని రూపొందించిందని విమర్శించారు. 'వేదాంత' కేసులో సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధంగా నిబంధనావళి ఉందని తెలి పారు. ముందుగా స్థానిక ఆదివాసీలు, గిరిజనుల అనుమతి తీసుకున్నాకే ప్రాజెక్టుకు ఆమోదం తెలుపుతామని 2015లో కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పుడు దానికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవటమేంటని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. అటవీ భూముల వాడకంపై కేంద్రం అత్యంత వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. అటవీ భూముల్లో ప్రాజెక్ట్ చేపట్టడానికి ప్రయివేటు డెవలపర్స్‌కు కేంద్రం అనుమతి ఇచ్చాక, జిల్లా కలెక్టర్ చేసేదేముంటుం ది? గ్రామ సభ ద్వారా అభిప్రాయం, స్థానిక ఆదివాసీలు, గిరిజనుల హక్కుల పరిరక్షణ.. అంతా తూతూమంత్రం గా మారుతుంది. ఇదంతా అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించటమే. కొత్త అటవీ నియ మాలను తక్షణమే రద్దు చేసి వెనక్కు తీసుకోవాలి.

## వజ్రోత్సవ భారతికి కోటి జెండాల వందనం

హైదరాబాద్, : స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా తెలంగాణలోని ప్రతి ఇంటిపై ఎగురవేయనున్న కోటి జాతీయ జెండాలను సిరిసిల్లలోని నేత కార్మికుల ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారు. రూ.23 కోట్ల వ్యయంతో 60 లక్షల మీటర్ల స్వచ్ఛమైన పాలిస్టర్ వస్త్రంతో వీటిని రూపొందిస్తున్నారు. వస్త్రం తయారీ, రంగుల అద్దకం, జెండాలు కుట్టడం తదితర పనులన్నీ నేత కార్మికులే చేస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 50 లక్షల జెండాలను సిరిసిల్లలో, మిగిలిన 50 లక్షల జెండాలను హైదరాబాద్‌లో కుట్టిస్తున్నట్టు అధికారులు చెప్పారు.

ఈ నెల ఐదు నుంచి పదో తేదీలోగా జెండాలు జిల్లాలకు రవాణా చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. ప్రతి కుటుంబానికి ఒకటి చొప్పున ఉచితంగా జెండాలు పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. జెండాలను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోకుండా ఇక్కడే తయారు చేసుకోవడం వల్ల నేత కార్మికులకు ఉపాధి కలుగుతున్నదని వెల్లడించారు.



# తెలంగాణలో బీజేపీ సరికొత్త ప్లాన్ వర్కవుట్ అయ్యేనా?



**హైదరాబాద్, :** దక్షిణ భారతదేశంలో కర్ణాటక తర్వాత తాము అధికారంలోకి రావడానికి అవకాశం ఉన్న రాష్ట్రంగా తెలంగాణను బీజేపీ భావిస్తోంది. వచ్చే ఏడాది జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి అధికారం దక్కించుకోవాలని ప్రధాని మోదీ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ద్వయం వ్యూహాలు పన్నుతోందని వార్తలు వస్తున్నాయి. అయితే ఓవైపు రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అత్యంత బలంగా ఉంది. మరోవైపు అధికార టీఆర్ఎస్ ఎలాగూ ఉండనే ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో అధికారం దక్కించుకోవడం బీజేపీకి అంత సులువు కాదని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ను టీఆర్ఎస్ను దాటుకుని అధికారం దక్కించుకోవడంపై కమలనాథులు ఫోకస్ పెట్టారని అంటున్నారు. తెలంగాణలో గోవా మోడల్ను తీసుకురావడానికి సిద్ధమవుతున్నారని చెబుతున్నారు. గెలుస్తారనుకున్న వ్యక్తులను ఆయా నియోజకవర్గాల్లో మంచి పేరున్న వ్యక్తులను పార్టీలోకి ఆహ్వానించి వారికి సీట్లు ఇవ్వడం అలాగే గెలిచే అవకాశం ఆర్థిక దన్ను ఉన్నవారి కుటుంబ సభ్యులకు కూడా సీట్ల ఇవ్వడమే గోవా మోడల్ అని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ప్లాన్ను అమలు చేయడానికి బీజేపీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి బీజేపీ సీట్లు ఇచ్చేటప్పుడు జంపింగ్ జపాంగులకు అంతగా సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వదు. మొదట నుంచి పార్టీలో నిబద్ధతతో పనిచేస్తున్నవారు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) భజరంగ్దళ్ నేపథ్యం ఉన్నవారికే సీట్లు కేటాయిస్తుంది. అయితే ఈసారి ఈ ఆనవాయితీని బ్రేక్ చేస్తుందని వార్తలు వస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడమే ముఖ్యం కాబట్టి పాత సంప్రదాయాలన్నింటికి చెల్లుచీటీ ఇచ్చి ముందుకు వెళ్లాలని బీజేపీ అధిష్టానం తలపోస్తోందని చెబుతున్నారు. అసలే తెలంగాణలో బీజేపీకి చాలా నియోజకవర్గాల్లో ఇప్పటికీ ఇన్చార్జులే లేరు. గట్టి అభ్యర్థులూ లేరు. ఓడిపోయే అభ్యర్థులకు సీట్లు ఇవ్వడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని బీజేపీ ఆలోచనగా ఉందని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రిస్కు చేయడం కంటే గెలుస్తారనుకున్న అభ్యర్థులను మంచి పేరున్న అభ్యర్థులను పార్టీలోకి ఆహ్వానించాలనే యోచనలో బీజేపీ అధిష్టానం ఉందని చెబుతున్నారు. అలాగే సర్వేల ద్వారానూ గట్టి అభ్యర్థులను గుర్తించే పనిలో బీజేపీ ఉందని అంటున్నారు.

# శ్రావణ మాసం.. రద్దీగా పూల మార్కెట్లు



హైదరాబాద్ : పండుగలు వచ్చాయంటే పూజలకు పూలు ఎక్కువగా వాడతారు. అందుకే పూలకు ఫుల్ డిమాండ్ ఉండడంతో పాటు రేట్లు పెరుగుతాయి. ప్రస్తుతం గుడిమల్కాపూర్ మార్కెట్ కి బెంగళూరు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ నుంచి పూలు దిగుమతి అవుతున్నాయి. శ్రావణ మాసం రావడంతో పూలమార్కెట్లు రద్దీగా మారాయి. హైదరాబాద్ సిటీ మార్కెట్ కు బెంగళూరు నుంచి తెల్ల చామంతి, రోజాలు, బొకే ఫ్లవర్స్ వస్తున్నాయి. చేవెళ్ల, కదిరి నుంచి కనకాంబరాలు, చేవెళ్ల, శంషాబాద్, శామీర్ పేట, ఏపీలోని రాజమండ్రి నుంచి పూలు దిగుమతి అవుతున్నాయి. గుడిమల్కాపూర్ మార్కెట్ కు బంతి, చామంతి, లిల్లీ పూలు వస్తున్నాయి. టైగర్ రోజ్, సెంట్ రోజ్, కలర్ రోజ్ పూలు నిన్నటి దాకా కేజీ రూ. 30 దాకా ఉండేవి. ఇప్పుడు రూ. 60 నుంచి రూ. 80 పలుకుతున్నాయి. కేజీ రూ. 50 ఉండే లిల్లీ పూలు...రూ. 130 నుంచి రూ. 180 దాకా ఉన్నాయి. నెల రోజులుగా కనకాంబరాలు కేజీ రూ. 300 దాకా ఉండేవి. కానీ ఇప్పుడు రూ. 550 నుంచి రూ. 650దాకా పలుకుతున్నాయి. చామంతి రేటు కూడా పెరిగింది. కేజీ రూ. 200, సన్నజాజులు రూ. 500 నుంచి రూ. 600 దాకా ఉన్నాయి. శ్రావణ మాసంతో పండుగల సీజన్ స్టార్ట్ అవుతుందనీ... అందుకే పూల రేట్లు పెరిగాయని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. ఈ నెల నుంచి తమకు గిరాకీ బాగుంటుందని చెబుతున్నారు. గత వారం కంటే ఇప్పుడు పూల రేట్లు అధికమయ్యాయని ప్రజలు వెల్లడిస్తున్నారు. అయినా పూజల కోసం కొనక తప్పడం లేదని చెబుతున్నారు. శ్రావణ శుక్రవారం కావడంతో పూజ సామాన్లన్నీ ఇక్కడే దొరుకుతాయని అందుకే గుడిమల్కాపూర్ మార్కెట్ వచ్చామంటున్నారు. హైదరాబాద్ సిటీలోని మార్కెట్లన్నీ పూల కొనుగోళ్ళతో బిజీగా మారాయి.

# అక్కరకు రాని చట్టాలకు చెల్లుచీటి

## పలు చట్టాలను బుట్టదాఖలు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, : పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న పాతచట్టాల దుమ్ముదులుపుతున్నారు. వాటిలో అక్కరకు రాని కొన్నింటిని తీసి పడేస్తున్నారు. ఆర్థికంగా పురోగమిస్తున్న భారత్ వ్యాపారాలను సరళీకృతం చేయడం ద్వారా అత్యున్నత భారత్‌గా శతవర్ష స్వాతంత్ర్యం వైపు వడివడిగా అడుగులు వేస్తోంది. వ్యాపారానికి అవరోధంగా తయారైన చట్టాలు లేదా నిబంధనలు 2,875 దాకా ఉన్నాయని గుర్తించిన ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం వాటిల్లో 2007 చట్టాలను, లేదా నిబంధనలు పూర్తిగా రద్దు చేసింది! అదేవిధంగా దీర్ఘకాలిక పరిష్కార అన్వేషణలో భాగంగా 20 వేల వరకు అనవసర పత్రిల తొలగింపునకు వినూత్న చర్యలు తీసుకుంది. వ్యాపారాలలోకి పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పెట్టుబడిదారుల కోసం ఏక గవాక్ష అనుమతుల విధానం ప్రవేశపెట్టింది. వ్యాపారానికి అవసరమైన ఆమోద, అనుమతుల సంఖ్య 14 నుంచి 3కు తగ్గించింది! వ్యాపార ఆర్థిక సంస్కరణల విషయానికి వస్తే జి.ఎస్.టి. అమలు భారత్ సాధించిన పెద్ద ముందడుగు. ఒకప్పుడు వస్తువు ఒకటే అయినా దాని ధర రాష్ట్రానికో రకంగా మారిపోయేది! ఐదేళ్ల క్రిందట జి.ఎస్.టి. అమలులోకి రావడంతో దేశం ఏకీకృత పన్ను విధానంలోకి పాదం మోపింది. 'ఆక్ట్రాయ్', 'నాకా'ల రద్దుతో వ్యాపారులకు పన్ను పత్రాల దాఖలు సులభమైంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపైన కూడా ప్రభుత్వం నిబంధనలను గణనీయంగా సంస్కరించింది. వాణిజ్య సౌలభ్యం విషయంలో 2014 నాటికి 142వ స్థానంలో ఉన్న భారతదేశం 2020 నాటికల్లా 63వ స్థానానికి దూసుకెళ్లింది. ఇదే దూకుడును ఇకముందు మరింతగా కొనసాగించాలని ఈ అమృతోత్సవాల సందర్భంగా ప్రభుత్వం కంకణం కట్టుకుంది.

# సామాన్యుల పట్ల మారని బ్యాంకులతీరు

## కష్టమర్లకు మళ్లీ చేరువయ్యే యత్నాలు

## ఆన్‌లైన్ లావాదేవీలు పెంచాలన్న యోచన

న్యూఢిల్లీ, :అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వినియోగదారులకు ఈ మధ్య కాలంలో మళ్లీ దగ్గర కావడానికి యత్నిస్తోంది. కరోనాతో డీలావడ్డ బ్యాంకింగ్ రంగాన్ని పట్టాలకెక్కించేందుకు అన్ని బ్యాంకులు యత్నిస్తున్నాయి. గృహ,వాహన రుణాలపై వడ్డీలు తగ్గిస్తోంది. అలాగే కస్టమర్లపై ఎడాపెడా వడ్డింపులకు దూరంగా ఉండాలని చూస్తోంది. ఇప్పటికే బ్యాంకుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. కరోనా కష్ట కాలంలోనూ బ్యాంకులు తమ బుద్ధి పోనిచ్చుకోలేదు. రుణాలపై రిజర్వ్ బ్యాంకు మారిటోరియం విధించినా వడ్డీలు మాత్రం తడిసి మోపెడు అయ్యాయి. ఇకపోతే అనేక బ్యాంకులు డెబిట్, క్రెడిట్ కార్డులు తొలగించి, మరిన్ని డిజిటల్ చెల్లింపు విధానాలను అమల్లోకి తీసుకు రావాలని యోచిస్తున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీలను ప్రోత్సహించాలని చూస్తోంది. దేశంలో అయిదోవంతు జనాభాకు ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు అందిస్తోంది. ఎస్‌బీఐ ఖాతాదార్లలో అత్యధికులు డెబిట్‌కార్డులపై ఆధారపడి ఉన్న సంగతి విదితమే. అయినా కూడా బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి ప్లాస్టిక్ కార్డులను తొలగించాలన్నది తమ యోచన అని, ఇది సాధ్యం చేయగలమని భావిస్తున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ గతంలో తెలిపారు. ఎస్‌బీఐ అందుబాటులోకి తెచ్చిన యోనో వంటి యాప్‌ల ద్వారా, దేశీయంగా డెబిట్ కార్డుల వినియోగాన్ని తగ్గించగలమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశం మొత్తంమీద దాదాపు 93 కోట్ల డెబిట్, క్రెడిట్‌కార్డులు వినియోగంలో ఉన్నాయని వెల్లడించారు. యోనో యాప్ సాయంతో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరించవచ్చని, కార్డు లేకుండా దుకాణాల్లో చెల్లింపులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. కొన్ని ఉత్పత్తుల కొనుగోలుకు యోనో యాప్ ద్వారా రుణం కూడా పొందవచ్చని, అందువల్ల క్రెడిట్‌కార్డు కూడా 'బేబులో ప్రత్యామ్నాయ సాధనం'గా మిగిలిపోతుందని ఎస్‌బీఐ ఛైర్మన్ వివరించారు. రాబోయే అయిదేళ్లలో దేశీయంగా కార్డు అవసరం అత్యంత పరిమితం అవుతుందని, వర్చువల్ కూపన్లే ప్రధానపాత్ర పోషిస్తాయని తెలిపారు. చెల్లింపులకు ప్రస్తుతం అనుసరిస్తున్న క్యూఆర్ కోడ్ విధానం కూడా ఖరీదైనదేనని పేర్కొన్నారు.

## అద్భుత నిర్మాణం.. కోరుట్ల వైకుంఠధామం



కోరుట్ల, : ఆధునికహంగులు.. మెరుగైన వసతులతో కోరుట్ల పట్టణంలోని సాయిరామ నదీతీరాన వైకుంఠధామం అత్యద్భుతంగా నిర్మితమైంది. 1.90 కోట్ల పట్టణ ప్రగతి నిధులతో నిర్మించిన ఈ శ్మశాన వాటికలో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తున్నది. తెలంగాణ సర్కారు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మిస్తున్న వైకుంఠధామాల్లో ఇది మేటిగా నిలువనున్నది. మూడు బర్నింగ్ ప్లాట్ ఫామ్స్, సిట్టింగ్ గ్యాలరీ, ఉడ్ స్టోరేజీ హాల్, కర్మకాండల గది, ఆఫీస్ రూమ్, అస్థికలు, బూడిద నిల్వ చేయు గది, మహిళలు, పురుషులకు వేర్వేరుగా మూత్ర శాలల గదులు, గజిబో గార్డెనింగ్, స్టోన్ శివ స్టాచ్యూ ఉన్నాయి. వారం రోజుల్లో ఇది అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.

# రాజయోగం.. ఎలక్ట్రీషియన్ వృత్తి నుంచి ఓ దీవికి రాజుగా..!



నిన్న మొన్నటి వరకు అతడొక సాధారణ ఎలక్ట్రీషియన్. ఇప్పుడతడు ఏకంగా ఒక దీవికి రాజయ్యాడు. వాయవ్య ఇంగ్లాండ్‌లోని కంబ్రియా కౌంటీ ఫర్నెస్ తీరానికి దాదాపు మైలు దూరంలో ఉంది 'పీల్ ఐలాండ్' అనే దీవి. దీని విస్తీర్ణం 26 ఎకరాలు. ఈ దీవిని సొంతం చేసుకోవడానికి సుమారు రెండువందల మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. అదృష్టం వరించడంతో ఆరన్ సాండర్సర్ అనే ముప్పయి మూడేళ్ల సామాన్య ఎలక్ట్రీషియన్ ఈ దీవిని ఇటీవల సొంతం చేసుకోగలిగాడు. అంతేకాదు, 170 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం 'కింగ్ ఆఫ్ పీల్ ఐలాండ్'గా త్వరలోనే పట్టాభిషక్తుడు కానున్నాడు. ఇంతకీ ఈ సామాన్యుడు ఎలా రాజు అయ్యాడనుకుంటున్నారా? అదంతా ఒక సంప్రదాయ ప్రక్రియ ప్రకారం జరిగిపోయింది. పర్యాటక కేంద్రమైన 'పీల్ ఐలాండ్'లో ఒక పబ్ ఉంది. ఇంగ్లాండ్ నలుమూలల నుంచి ఇక్కడకు జనాలు తరచుగా వస్తుంటారు. అప్పుడప్పుడు చుట్టుపక్కల యూరోపియన్ దేశాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. సెలవు రోజుల్లో ఈ దీవిలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. పర్యాటకులు ఇక్కడి టెంట్లలో బస చేస్తుంటారు. టెంట్లలో బస చేయడానికి రోజుకు 5 పౌండ్లు (సుమారు రూ.500) వసూలు చేస్తారు. చిరకాల సంప్రదాయం ప్రకారం క్రంబియా కౌంటీ ఈ దీవిలోని పబ్‌ను నడిపేందుకు టెండర్లు ఆహ్వానించింది. రెండు వందల మందికి పైగా దీనిని దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. చివరకు ఆరన్ సాండర్సన్‌కు ఇది దక్కింది. పబ్ యాజమాన్యంతో పాటు, దీవికి రాజుగా పట్టాభిషేకం, దాంతో పాటే ఇంగ్లాండ్ రాణి ఎలిజబెత్ అనుగ్రహించే 'నైట్‌హుడ్' కూడా ఇతడికి త్వరలోనే దక్కనున్నాయి. కౌన్సిల్ సభ్యులు ఈ విషయం తనతో చెబితే మొదట నమ్మలేకపోయానని, ఈ దీవికి రాజుగా పట్టాభిషిక్తుణ్ణి కానుండటం ఎంతో సంతోషంగా ఉందని సాండర్సన్ మీడియా ఎదుట ఉబ్బితబ్బిబ్బయ్యాడు. పీల్ ఐలాండ్‌లో పబ్‌తో పాటు పురాతనమైన కోట కూడా పర్యాటక ఆకర్షణగా ఉంటోంది. ఫర్నెస్ ప్రాంతానికి చెందిన మతగురువులు పన్నెండో శతాబ్దిలో ఇక్కడ పెద్ద రాతికోటను నిర్మించారు. ఈ దీవి నుంచి ఫర్నెస్ తీరానికి రాకపోకలు జరిపేందుకు ఒక మరపడవ అందుబాటులో ఉంటుంది. ఈ మరపడవలో పదిహేను నిమిషాల్లో ఫర్నెస్ తీరానికి చేరుకోవచ్చు. రాడ్ స్కార్ అనే వ్యక్తి ఇప్పటివరకు ఈ దీవికి రాజుగా కొనసాగుతున్నాడు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సాండర్సన్అతడి నుంచి పదవీబాధ్యతలుస్వీకరించి, అధికార లాంఛనాలతో పట్టాభిషిక్తుడు కానున్నాడు. పట్టాభిషేకం తర్వాత పబ్ నిర్వహణతోపాటు దీవి మొత్తం అతడిఅధీనంలోనే ఉంటుంది. అదృష్టం కలిసొస్తే, ఇలా అనుకోకుండానే 'రాజ'యోగం పడుతుందేమో!

# అధికార దుర్వినియోగం చేస్తున్న హెల్త్ డైరెక్టర్ రాజీనామా చేయాలి

**నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగం పొందిన వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోరా ?**

**వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ నరాల సత్యనారాయణ**



**కొత్తగూడెం (ఉదయం రిపోర్టర్)** గిరిజనుల ఉద్యోగాలకు గండి కొడుతున్న హెల్త్ డైరెక్టర్ పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ నరాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. వైద్యశాఖలో రాష్ట్ర అత్యున్నత పదవిలో ఉన్న గడల శ్రీనివాసరావు కేవలం రాజకీయ కాంక్షతోనే కొత్తగూడెం నియోజకవర్గంలో పట్టుకోసం అడిగిన వాళ్లందరికీ ఉద్యోగం ఇవ్వాలని సిఫారసు లేఖలు పంపడం అధికార దుర్వినియోగం లెక్కలోకి వస్తుందన్నారు. ఆసుపత్రిలో 12 వేల జీతం వచ్చే చిన్న స్వీపర్ ఉద్యోగం ఇవ్వాలన్న నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించి, వాటిలో మెరిట్ ఉన్న వాటిని పరిగణలోకి తీసుకుని ఉద్యోగం ఇవ్వాల్సిన బాధ్యత జిల్లా అధికారులది. ఏజెన్సీలో గిరిజనులని కాదని గిరిజనేతరులకు ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ హోదాలో సిఫార్సు లేఖలు పంపుతూ జిల్లాలో అధికారులను తన గుప్పెట్లో పెట్టుకుని గిరిజన హక్కులను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోన్న హెల్త్ డైరెక్టర్ తీరు సమంజసం కాదని నరాల సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. బంధుప్రీతితో తన మరదలు సామినేని దుర్గాభవనికి, రాజకీయ సమీకరణం కోసం ప్రజాప్రతినిధి కుమార్తె కంచర్ల లేఖశ్రీ లకు నిబంధనలకు విరుద్ధంగా కేవలం తన సిఫార్సు లేఖల ద్వారా ఉద్యోగం ఇవ్వడం కరెక్ట్ కాదు. గడల శ్రీనివాసరావు కేవలం తన రాజకీయ లబ్ది కోసమే ఏజెన్సీ పరిధిలో నిబంధనలు కాదని తనకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇస్తూ ప్రజలకు దగ్గరవ్వాలని చూస్తున్నారు. కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు ఎవరు ఎలాంటి వారో తెలుసని ఎన్నికల సమయంలో ఖచ్చితంగా ప్రజలకు సేవ చేసే వారినే ఎన్నుకుంటారని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ నరాల సత్యనారాయణ అన్నారు.

# పేదల ఇండ్ల కూల్చివేతకు ఏడాది

**బాదిత కుటుంబాలకు పునరావాసం కల్పించడంలో జాప్యమెందుకు..?**

**బాదిత నిర్వాసితులకు ఇచ్చిన హామీని అమలుచేయండి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా**






**కొత్తగూడెం (ఉదయం రిపోర్టర్)** కొత్తగూడెం పట్టణంలోని రైల్వే స్టేసన్ ఏరియా మేదరబస్తి కిరోసిన్ బంక్ ఏరియాలో పేదలు నివసిస్తున్న ఇండ్లను కూల్చివేసి నిర్వాసితులు చేసి ఏడాది గడిచిన సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో నిర్వాసితులు సోమవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తంచేశారు. కళ్ళకు నల్లరిబ్బన్లు దరించి నిర్వాసిత ప్రాంతం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా మాట్లాడుతూ రైల్వే స్టేషన్ సమీపంలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న సుమారు 200 కుటుంబాలను అమానవీయ కోణంలో రైల్వే శాఖ, ప్రభుత్వం రోడ్డుపాలు చేసిందని, కోడి కూయకముందే ఇండ్లను యంత్రాలతో ధ్వసం చేయడంతో కట్టుబట్టలతో పేదలు రోడ్డుపాలయ్యారన్నారు. తూతూమంతంగా కొద్ది రోజులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి గాలికి వదిలేశారన్నారు. వీరికి ప్రత్యామ్నయ గృహాలు ఏర్పాటు చేస్తామన్నా ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం హామీ ఏడాది గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి తక్షణమే బాదిత కుటుంబాలకు ప్రత్యామ్నయ గృహాలు ఏర్పాటు చేసి పునరావాసం కల్పించడంతోపాటు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వై.శ్రీనివాసరెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్, నాయకులు సర్వేశ్వర్రావు, శ్రీనివాస్, సత్తి, చందర్, అనసూర్య, నిశా, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, లలిత, ప్రభాకర్, మోష, పద్మ, హైమర్, సాయి,లక్ష్మి, ప్రభావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## మాపై దయ చూపండి అంటున్న 5 వార్డ్ కౌన్సిలర్



**కొత్తగూడెం (ఉదయం రిపోర్టర్)** మున్సిపాలిటీ పరిధిలోని 5 వార్డ్ లో ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ కు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో 5 వార్డ్ కౌన్సిలర్ తలుగు అనిల్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 వార్డ్ లో మౌలిక వసతులు కరువైపోయాయని పిల్లల ఆడుకోవడానికి ఆటస్థలం, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ లాంటివి ఏమి లేవని, అంతర్గత రోడ్లు కాలువలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ వినతి పత్రం అందచేసినట్లు ఆయన తెలిపారు. దీనిపై సత్వరమే చర్యలు తీసుకొని ప్రజలకు మౌలిక సదుపాయాల కొరకు నిధులను మంజూరు చేసి ఐదవ వార్డు ప్రజల కష్టాలు, ఇబ్బందుల నుండి విముక్తి కలగజేయాలని కోరారు. అదేవిధంగా పట్టణ ప్రగతిలో మిగులు నిధుల నుండి ఓపెన్ జిమ్, ల్యాండ్ స్కేటింగ్, పిల్లల ఆటలు పరికరాలు వంటివి మంజూరు చేసి ఐదవ వార్డు ప్రజలకు అందజేయాలని కోరారు.

# ఆగని అక్రమ నిర్మాణ పనులు

***వార్తా కథనాలు వెలువడినా చోద్యం చూస్తున్న అధికారులు***

***గతంలో తూతూమంత్రంగా కూల్చివేతలు***

***అక్రమ నిర్మాణం వైపు కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్ అధికారులు***

***కమిషనర్ కట్టుకొని చెప్పారంటున్న నిర్మాణ దారుడు***



**కొత్తగూడెం (ఉదయం రిపోర్టర్ )**రాష్ట్ర వ్యాప్తంగా ఏ మున్సిపాలిటీ పరిధిలో అయినా సరే, అనుమతులకు లోబడని నిర్మాణాలను సహించేది లేదంటూ ఒకపక్క రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చెబుతున్నప్పటికీ, అక్రమ నిర్మాణాలను అరికట్టే విధంగా రకరకాల చట్టాలు తీసుకొవస్తున్నా కూడా, కొంతమంది అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా మంత్రి చెప్పిన మాటలు కానీ, చట్టలాకు కానీ విలువలు లేకుండా పోతున్నాయి. ప్రభుత్వ చట్టాలు పేపర్ ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి తప్ప, చర్యలు తీసుకోవడంలో మాత్రం ప్రభుత్వ అధికారులు,మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలు దారులకు వెన్నుదన్నుగా నిలుస్తుండటం నిర్మాణదారులకు వరంగా మారింది. కొత్తగూడెం పట్టణంలో అక్రమ నిర్మాణాలు, అనుమతిమించి అడ్డగోలుగా నిర్మిస్తున్న నిర్మాణాలు పుట్టగొడుగుల వేధిస్తున్నాయి. అనుమతికి మించి నిర్మిస్తున్న నిర్మాణాలు కొన్ని అయితే, సెట్ బ్యాక్ జరగకుండా నిర్మిస్తున్న నిర్మాణాలు మరికొన్ని ఉన్నాయి. ఈ నిర్మాణాలన్నిటికి టౌన్ ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్టు వదిలేస్తున్నారా.? లేక లంచాలు పుచ్చుకోవడంతోనే అడ్డుకోవడంలేదా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అక్రమ నిర్మాణాదారులకు రాజకీయ నాయకుల పలుకుబడి ఉందని, అందుకే ఆ నిర్మాణాలపై ఎన్ని కథనాలు వెలువడిన చర్యలు తీసుకోవడం లేదని బహిరంగ ఆరోపణలు చేస్తున్నారు. గతంలో మున్సిపల్ ఆఫీసుకు కూతవేటు దూరంలో టీటీడీ కళ్యాణమండపం ఎదురుగా అక్రమ నిర్మాణంపై పలు వార్తాకథనాలను ప్రచురితమయ్యాయి. అప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టి వారి జేబులు నింపుకుంటునన్నారే తప్ప, అక్రమ మార్గంలో నిర్మాణం చేసిన నిర్మాణాన్ని మాత్రం ఈ రోజు వరకు కూల్చలేదు.



**ఈ నిర్మాణాన్ని అధికారులు పట్టించుకోరు :** కౌన్సిలర్ తలుగు అనిల్మున్సిపాలిటీ పరిధిలోని ఈ బిల్డింగ్ పై ఎన్నో వార్తా కథనాలు వెలువడిన అప్పటికి, టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ బిల్డింగ్ పై పెంచుకున్న మమకారమో ఏమో కానీ, బిల్డింగ్ వైపు మళ్ళీ చూసింది కూడా లేదు. అక్రమంగా బిల్డింగ్ నిర్మాణం చేపట్టగా అప్పట్లో ఆ ఆపేయాలని అధికారులు స్లాబ్ ను స్వల్పంగా ధ్వంసం చేసి నిర్మాణం చేయకుడదని బ్యానర్ పెట్టారని కానీ అధికారులు చెప్తే వినాలా అనుకున్నాడో ఏమో గాని, బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నాడని, ఇంత తతంగం జరుగుతున్న అధికారులు పట్టించుకోకుండా మీనమేషాలు లెక్కించడం సబబేనా అని అని వార్డ్ కౌన్సిలర్ తలుగు అనిల్ ప్రశ్నించారు.

**కమిషనర్ కట్టుకోమన్నాడు మా నిర్మాణం మా ఇష్టం.!:** మున్సిపల్ కమిషనర్ సార్ కట్టుకో మన్నారు ఆపడానికి మీరెవరు అంటూ అక్రమ నిర్మాణంపై ఎవరైనా మాట్లాడితే వారిపై విరుచుపడుతున్నాడు సదరు అక్రమ నిర్మాణ దారుడు. టౌన్ ప్లానింగ్ అధికారుల మాట వినాల్సిన అవసరం నాకు లేదంటూ మున్సిపల్ కమిషనర్ నాకు అనుమతి ఇచ్చారు. మీకెవరికి ఎలాంటి సంభందం లేదు అనడం విశేషం. అందుకే టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా చూస్తూ ఉంటున్నారే తప్ప ఆ నిర్మాణంపై చర్యలు ఏమి తీసుకోవడం లేదని అర్థం అవుతుంది. ఇలా అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోకుండా కమిషనర్ అడ్డుకోవడం సమంజసమా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టిన పీఈటీ పై తక్షణమే చర్యలు తీసుకోవాలి

## నవీన్ రాథోడ్



**జూలూరుపాడు (ఉదయం రిపోర్టర్)** మండల పరిధిలోని పడమటి నరసాపురంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 9,10 తరగతులు చదువుతున్న 16 మంది విద్యార్థినులను ఆడ పిల్లలని కూడా చూడకుండా విచక్షణారహితంగా కొట్టిన పీఈటీ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షులు నవీన్ రాథోడ్ అన్నారు. ఈ విషయంపై నవీన్ రాథోడ్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం తో రమేష్ ఫోన్ లో మాట్లాడగా?గత రెండు సంవత్సరాల నుండి ప్రభుత్వము యూనిఫామ్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందనే విషయం అందరికి తెలిసిందే, అన్నీ తెలిసి కూడా సోయి లేకుండా విద్యార్థులు యూనిఫాం వేసుకోలేదనే సాకుతో ఆడ పిల్లలు అని కూడా చూడకుండా వాతలు పడేలా విచక్షణా రహితంగా కొట్టిన పీఈటీ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు మరలా పునరావృతం కాకుండా చుసుకోవాలని హెచ్ఎం పై నవీన్ రాథోడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కమిట్మెంట్ చిత్ర యూనిట్ పై వనస్థలీపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

హైదరాబాద్: బెడ్ రూంలో శృంగారంతో కూడిన అశ్లీల దృశ్యాలకు భగవద్గీత శ్లోకాలను జోడించి చిత్రీకరించిన కమిట్మెంట్ చిత్ర దర్శక నిర్మాతలపై, నటి నటులపై మరియు చిత్ర ట్రైలర్ కు అనుమతించిన సిన్సార్ బోర్డు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహా కార్యదర్శి రావినూతల శశిధర్ వనస్థలీపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది . ఈ సందర్భంగా రావినూతల శశిధర్ మాట్లాడుతూ “హిందువులు పరమ పవిత్రంగా పూజించే భగవద్గీత శ్లోకాలను అశ్లీల దృశ్యాలకు జోడించి హిందువుల విశ్వాసాలను తీవ్రంగా గాయపరచారని , వెంటనే సంబంధిత వ్యక్తులను అరెస్టు చేయకపోతే వి హెచ్పి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుందని, చిత్ర ప్రదర్శనను అడ్డుకుంటామని, డిస్ట్రిబ్యూటర్లు ఉ సినిమా థియేటర్ యాజమాన్యాలు కూడా చిత్రాన్ని సామాజిక బహిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు . సినిమారంగాన్ని కేంద్రంగా చేసుకొని భారతీయ సాంస్కృతిపై జీహద్ చేస్తున్నారని అందులో భాగంగానే హిందూ ఆచారాలు దేవీ దేవతలను కించపరుస్తూ అవహేళన చేస్తూ సినిమాల నిర్మాణం జరుగుతుందని దీనిపై ఎన్ఐయే చే విచారణ జరిపించాలని, కాలం చెల్లిన లోపబూయిష్ఠమైన సినిమాటోగ్రాఫి చట్టాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు”. ఈ కార్యక్రమంలో ముద్దగోని శేఖర్ గౌడ్, తడకమళ్ళ రవికుమార్, సతీష్, శ్రీధర్ రెడ్డి, రవిశంకర్, శ్రీనివాస్, భగీరథ్ తదితరులు పాల్గొన్నారు

# పెట్రోల్పై రూ.10.. డీజిల్పై రూ.14 నష్టం..

## ఇదీ ఇండియన్ ఆయిల్ తీరు!



హైదరాబాద్ :ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) గత ఏప్రిల్-జూన్ మధ్య లీటర్ పెట్రోల్పై రూ.10, లీటర్ డీజిల్పై రూ.14 నష్టపోతున్నాయి. గత రెండేండ్లలో ఇది తొలిసారి అని ఓ అధ్యయనం తెలిపింది. జూన్ నెలతో ముగిసిన త్రైమాసికంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) రూ.1,992.53 కోట్ల నికర నష్టాన్ని చవిచూసినట్లు ప్రకటించింది. 2021-22 తొలి త్రైమాసికంలో రూ.5,941.37 కోట్లు, గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రూ.6,021.9 కోట్ల నికర లాభం గడించింది ఐఓసీ. గత రెండేండ్లలో ఐఓసీ నష్టాల పాలవ్వడం ఇదే తొలిసారి. ఏడాది క్రితంతో పోలిస్తే ఈ ఏడాది తొలి త్రైమాసికం ఈబీఐటీడీఏ 88 శాతం తగ్గి రూ.1,358.9 కోట్లకు చేరుకున్నది. ఫలితంగా నికర నష్టం రూ.1992.5 కోట్లని ఐవోసీ వెల్లడించింది. బ్యారెల్ ముడి చమురు స్థూల రిఫైనరీ మార్జిన్ 31.8 డాలర్లుగా ఉన్నా ఐఓసీ నష్టాలు చవి చూడటం గమనార్హం. బహిరంగ మార్కెట్లో రోజువారీ ధరలకు అనుగుణంగా కేంద్ర చమురు సంస్థలు.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్పీసీఎల్) దేశీయ మార్కెట్లో ధరలు సవరిస్తూ వచ్చాయి. కానీ.. ఇటీవల ఏప్రిల్ ప్రారంభం నుంచి ముడి చమురు ధర పెరిగిపోయినా.. దేశీయ మార్కెట్లో పెట్రోల్, డీజిల్ ధరలు యధాతథంగా కొనసాగిస్తూ వచ్చాయి. బ్యారెల్ క్రూడాయిల్ ధర 109 డాలర్లుగా ఉన్నది. కానీ రిటైల్ పెట్రోల్ పంపుల్లో 85-86 డాలర్లకు సర్దుబాటు చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ధరలకు అనుగుణంగా ప్రతిరోజూ పెట్రోల్, డీజిల్ ధరలు సవరిస్తూ వచ్చిన చమురు సంస్థలు.. ఎన్నికల వేళ నిలిపేస్తూ వచ్చాయి. ఇటీవల ముగిసిన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. మార్చి వరకు పెట్రోల్, డీజిల్ ధరల సవరణ నిలిపేశాయి. ఏప్రిల్లో రూ.10 పెరిగినా.. మళ్లీ సవరించడం నిలిపేశాయి. ఉక్రెయిన్పై రష్యా యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. ఈ నేపథ్యంలో గత మే నెలలో పెట్రోల్, డీజిల్లపై కేంద్రం ఎక్సైజ్ సుంకం తగ్గించింది.

## సెప్టెంబర్ 26 నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు

అమరావతి : విజయవాడ ఇంద్రకీలాద్రిపై సెప్టెంబర్ 26 నుంచి దసరా ఉత్సవాలు జరగనున్నాయి. అందుకుగాను ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. దసరా సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించ నున్నారు. సెప్టెంబర్ 26 వ తేదీన దుర్గమ్మ శ్రీ స్వర్ణకవచాలంకృత అలంకారంలో, 27న బాలాత్రిపురా సుందరీదేవి, 28న గాయత్రీ దేవి, 29న శ్రీ అన్నపూర్ణదేవి అలంకార రూపంలో దర్శనమివ్వను న్నారు. 30న శ్రీలలితా త్రిపురా సుందరి దేవి, అక్టోబర్ 1న శ్రీ మహాలక్ష్మి దేవి, 2న శ్రీ సరస్వతీ దేవి, 3న శ్రీ దుర్గాదేవి, 4న శ్రీమహిషాసుర మర్దని, 5న రాజరాజేశ్వరీదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS, ALUGUNOOR (V), TIMMAPOOR (M), KARIMNAGAR DISTRICT, TELANUTNA““PUBLISHED FROM. HNO. 5-2-107, OSMANPURA, JAGITIAL, DISTRICT JAGITIAL, TELANGANA -RNI NO. APTEL/2011/39782